❖•❖•❖ 23 ❖•❖•❖

# కలత కలిగించిన కల

*"అతడు న్యాయపీఠముమీద కూర్చుండి యున్నప్పుడు అతని భార్య – 'నీవు ఆ నీతిమంతుని జోలికి పోవద్దు; ఈ ప్రొద్దు ఆయనను గూర్చి నేను కలలో మిక్కిలి బాధపడితినని' అతని యొద్దకు వర్తమానము పంపెను" (మత్తయి 27:19).*

పిలాతు పస్కా పండుగ వేడుకల నిమిత్తము యెరూషలేమునకు ప్రయాణమై వెళ్లినప్పుడు తన భార్యను తనతో కూడ తీసికొని వెళ్లాడు. ప్రేరేపణ లేకుండా లిఖింపబడిన, రెండవ శతాబ్దపు దస్తావేజు, *పిలాతు కార్యముల ప్రకారము*, పిలాతు భార్య పేరు ప్రోక్ల. ఒక ప్రభుత్వాధికారి మరోక చోటికి ప్రయాణమై వెళ్లినప్పుడు తన భార్యను తనతో కూడ తీసికొని వెళ్లుట సామాన్యంగా జరిగెడి విషయమే. పరగణాల ప్రభుత్వాధికారులు వారి ఆధ్వర్యము క్రింద పరిపాలింపబడుచుండిన ప్రదేశాలను సందర్శింప వెళ్లినప్పుడు వారితో కూడ తమ భార్యలను తీసికొని వెళ్లుటకు అనుమతించబడిరని ట్టాసిటస్ రచించాడు.[1] ఏది ఏమైనా, ఈ సందర్భంలో పిలాతు భార్య యెరూషలేములో ఉండుట పిలాతుకు సంకటము కలిగించేదిగానే రుజువైనది. ఆమె పేరు మన ప్రభువు తీర్పుల కథనములలో చేర్చబడి మత్తయి వ్రాసిన సువార్తలో ఒక ప్రత్యేక స్థానమును సంపాదించుకొన్నది. దేవుని నీతిమంతుడైన కుమారుడు సిలువవేయబడుచున్నాడనుటకు ఆమె ఒక రుజువును సమకూర్చినది.

యేసు యొక్క నిర్దోషత్వము చేత వెంటాడబడుచు, యూదులతో యింకా ఎక్కువ శత్రుత్వం పెంచుకొనకుండానే యేసును విడుదల చేయుటకు పిలాతు ప్రయత్నించుచుండెను. యేసులో ఆయన ఏ దోషమును కనుగొనలేదని చెప్పుచూ, యేసును గూర్చిన తీర్పును ఆయన అదివరకే ప్రకటించాడు; కానీ ఆ ఘోషణ పెడచెవినిపెట్టబడింది. అప్పటికే తన ముందుండిన సందిగ్ధావస్థలోనికి ఇంకా మునిగిపోతూ, పస్కా పండుగ సమయంలో ఒక ఖైదీని విడుదల చేయుటకు చాలా కాలం నుంచి ఉన్న వాడుకల జాబితాకు యేసును విడుదల చేయుట గూర్చిన అంశాన్ని చేర్చాడు. యూదులు యేసును ఒక నేరస్థునిగా ఎంచుచుండినంత వరకు, అయన విడుదల చేయబడుటను వారు అర్థాంగీకారంగానే అంగీకరిస్తారని పిలాతు అనుకొనుచుండెను. గనుక ఆయన యేసును మరియు బరబ్బను, అప్రతిష్టాపూర్వక నేరస్తుడని నలువైపుల పేరుగాంచిన వానిని, వారి ముందుంచి ఎవరు విడుదల చేయబడవలెనను విషయమై ఏదో ఒక నిర్ణయము తీసికొనబడవలెనని పిలాతు అదివరకే యూదులకు చెప్పియుండెను. వారి జవాబు కొరకు వేచియుంటూ ఆయన న్యాయస్థాన ఆసనముపై ఆసీనుడయ్యాడు. ఆ క్షణిక శాంతి సమయంలో, ప్రశాంతమైనవి, భయమును పుట్టించునవైన, వేదనతో కూడిన సుదీర్ఘాలోచనలో మునిగిపోయాడు.

"ఒక వేళ, బరబ్బ విడుదల చేయబడాలని వారు అడిగినట్లయితే నేనేం చేయాలి?" అను కలవరపాటు కలిగించు ప్రశ్న ఉరుములతో కూడిన అడుగులువేస్తూ అతని మనస్సులో పరుగులుతీస్తూ ఉండియుండవచ్చును. ఇంతలో ఆకస్మికముగా, "ఇప్పుడేంచేయాలి?" అని అనుకుంటున్న తీర్పుకు అంతరాయం కలుగజేస్తూ బంట్రౌతు ఒకడు అతని భార్య పంపించిన

ఒక చిన్న చీటీని అతని చేతుల్లో వుంచాడు. పిలాతు కంగారుతో వేంటనే ఆమె ఏమి వ్రాసియుంటుందోనని ఆ చీటీ తీసి చదువుకొన్నాడు.

బహుశ ఆ నాటి వేకువ జాముననే యేసుకు తీర్పు తీర్చుటకు తన భర్త వెళ్లియుండినందువలన తన ఆలోచనల్లో చెలరేగిన అలజడి మూలాన కావచ్చు అతని భార్య నిద్రలేచింది. బహుశ వారు నివాసముండిన చోటులు విడిచి వెళ్లుటకు సిద్ధపడుచూ అతని తీర్పు ఎలా సాగవచ్చునోయని కూడ పిలాతు ఆమెకు కొంచెము వివరించియుంటాడు. అటుతరువాత ఆమె మరలా నిద్రపోవుటకు ప్రయత్నించినప్పుడు ఒక వింతైనదియు కలత కలిగించునదైన కల కని యుంటుంది. పిలాతు ఆమెకు తెలియజెప్పిన వివరముతోపాటు, ఆమె యేసును గూర్చి అంతకు మునుపు ఎంతో కొంత వినియుంటుంది. యేసు మాటలు మరియు ఆయన క్రియల వార్త చేత యెరూషలేము ఉద్రేకముతో నిండియున్నది. బహుశ యేసు చేసిన బోధలు విన్నవారు ఆయన చేసిన అద్భుత క్రియలు చూచినవారిలో ఎవరో ఒకరు వాటన్నిటి గూర్చి ఆమెకు తెలియజెప్పి యుండవచ్చును. ఆమె కనిన కలలో, పిలాతు, తన భర్తచేత యేసు అన్యాయముగా తీర్పు తీర్చబడి మరణశిక్ష విధించబడుట ఆమె చూచి యుండవచ్చును. ఆమె గజగజ వణకుచూ అమితాశ్చర్యంతో కూడిన భయముతో ఆ కలలో నుండి మేల్కొన్నది. ఈ పీడకల ఆమె ఆత్మలోనికి చొచ్చుకపోయి ఆమెను గాఢంగా కుదిపివేసింది. ఈ ప్రమాదమును సూచించుచుండిన ఈ ప్రబోధము గూర్చి ఆమె ఏదో ఒకటి చేయుటకు బలవంతము చేయబడింది. పిలాతు భార్యయైన ప్రోక్ల చేయవలెనని ఆమెకు తెలిసిన ఒకే పని చేసింది: ఆమె కనిన కల గూర్చి వెంటనే చీటి ద్వారా తన భర్తకు చెప్పి పంపించినది. రోమీయులు వారు కనిన మరియు వారికి నివేదింపబడిన కలల వలన అతి గొప్పగా ప్రభావితులయ్యారని పరిశుద్ధ లేఖనములలో లేని యితర రుజువు బయలుపర్చుచున్నది. వారు కలల గూర్చిన అజ్ఞాత భయము కలిగియుండిరి. కైసరు జూలియస్ మరియు కైసరు ఔగుస్తు కలలకు చాలా ప్రాముఖ్యత నిచ్చారని సూటోనియా రచించిన *The Lives of the Twelve Caesars* సూచించుచున్నది.

ప్రోక్ల తన భర్తకు పంపించిన సందేశము నిర్మొహమాటమైనదై చెప్పాలనుకున్న విషయాన్ని సూటిగాను ముక్తసరిగాను తెలియజెప్పుచుండినదై యుండినది. “నీవు ఆ నీతిమంతుని జోలికి పోవద్దు; ఈ ప్రొద్దు ఆయనను గూర్చి నేను కలలో మిక్కిలి బాధపడితిని” అని ఆమె తన చీటీలో వ్రాసి పంపినది. నిస్సందేహంగా, ఆమె తన కల విషయము యిచ్చిన సాక్ష్యము గూర్చి పిలాతు సహితము వణికిపోయాడు. ఖచ్చితంగా అటు తరువాత ఏంచేయాలో అర్థమవక మరియు ఈ అల్లకల్లోలమంతటి పరిణామము గూర్చి ఆందోళన కలిగియుండిన పిలాతు అప్పటికే ఆత్రుతతో అధైర్యపడుచుండెను. యేసు నిర్దోషి అని అతడు నమ్మాడు, కానీ యూదుల చేత ఇరుకైన చిక్కులోనికి నెట్టబడి యేసు కేసును కొట్టివేయుటకు ఎన్ని విధాలుగా ప్రయత్నించినను ఫలితం కనబడలేదు. ఆలోచించాల్సిన విషయాలు యింకా ఎన్నో ఉండగా, ఇప్పుడు ఈ కలతో తృప్తిచెందాల్సి వుండినది. అతని పరిస్థితి అప్పటికే అతని అంతరంగంలో మండుచుండిన అగ్నికి ఆజ్యం పోసినట్లుండినది. “ఒక ప్రభుత్వాధికారిగా ఇటువంటి అసాధరణమైన తీర్పును నా యిన్నేళ్ల సర్వీసులో ఎన్నడూ చూడలేదు!” అని అనుకొనియుంటాడు.

పిలాతు వలెనే, ఈ కలను ఎలా అర్థంచేసుకోవాలి లేక దీని గూర్చి ఏమి ఆలోచించాలి

అని మనము అనుకొనవచ్చును. అదొక ప్రేరేపింపబడిన కలనా? దేవుడు తన ప్రభావమును పిలాతుపై ఈ అసాధరణమైన రీతిలో చూపవలెనని వెదకుచుండెనా? ఆయన కయప ద్వారా ఒక ప్రవచనాన్ని పలికాడు. అలాగే ఈ స్త్రీ ద్వారా కూడ ఆదే విధమైనది ఏదైనా పలుకుచుండెనా? మనము ఈ ప్రశ్నలకు సమాధానములనివ్వలేము, కానీ ఈ కలకు సంబంధించినవియు మనము చూసిచూడనట్లుండజాలనివియు కొన్ని గంభీర సత్యములను మనము చూడగలము.

*మొదటిదిగా, యేసు యొక్క నీతిమంతము, ఒక విధముగా కాకపోయినను మరొక విధముగా, మనలను వెంటాడుచునే యుండునని మనము నేర్చుకొనుచున్నాము.* పిలాతు భార్యను కలతచెందించిన అంశము ఈ కలలో ఏముండింది? కలలో యేసు ఆమె యెదుట నిర్దోషిగా నిలువబడి యున్నాడను వాస్తవమే. ఆమె యేసును గూర్చిన ఈ సత్యమును నమ్మినదో లేదో మనకు తెలియదు కానీ ఈ కల మాత్రం ఆమెలో ఎంతో గొప్ప కలతను కలిగించినది. “నా భర్త ఈ నిర్దోషిని సిలువ మరణమునకు అప్పగించినట్లయితే? ...” అని తనను తాను ప్రశ్నించుకొంటూ ఆమె మేల్కొన్నది.

ప్రతి ఒక్కరు, “లేఖనములు తెలియజెప్పుచున్నట్లు, యేసు సంపూర్తిగా నీతిమంతుడైయున్నట్లయితే ... ?” అని ప్రశ్నించుకోవాలి. దీని గూర్చి ఆలోచించు లేక ఆలోచనచేయగల ప్రతి ఒక్కరు ఈ ప్రశ్నచేత వెంటాడబడుదురు. లేఖనములు ఘోషించుచున్నట్లుగా, యేసు సంపూర్తిగా నీతిమంతమైనవాడైనట్లయితే, దేవుని కుమారుడు మనకు రక్షకుడగుటకే ఈ భువిని సందర్శించాడు. ఈ ప్రశ్న వేసికొనకుండా, యేసు జీవితమును అధ్యయనము చేయువారెవరునూ ఎంతో ఎక్కువ లోతుల్లోనికి వెళ్లజాలరు, సరికదా ఆయనను దేవుని కుమారుడుగా అంగీకరించకుండా ఆయన నీతిమంతుడని ఎవరునూ అంగీకరించజాలరు.

*రెండవదిగా, యేసును గూర్చిన ఎరుక ఎల్లప్పుడు ప్రశాంతతనివ్వదు, కానీ పర్యాయాలు ఒక పెనుతుఫానును తెచ్చునని మనము చూచుచున్నాము.* ప్రోక్లయొక్క కల ఆమె హృదయానికి సమాధానమును సమకూర్చలేదు; అది తీవ్రమైన సంక్షోభమును పరిచయం చేసింది. అది ఆమెను దేవుడు మానవుడు కలిసియున్న ఒక సుడిగాలిలోనికి దింపేసింది. “నేను భూమి మీదికి సమాధానమును పంపవచ్చితినని తలంచకుడి; ఖడ్గమునే, గాని సమాధానమును పంపుటకు నేను రాలేదు” అని యేసు ఒక సందర్భంలో చెప్పాడు (మత్తయి 10:34). ఈ స్త్రీ పస్కా పండుగను సంతోషభరితంగా జరుపుకోవాలను ఆశతో పిలాతుతో కూడ పయనించి యెరూషలేముకు వచ్చినది. ఈ చారిత్రాత్మక ఉదయమున తెలతెలవారుచుండగా, యుగాలన్నిటిలోకెల్లా అత్యంత గొప్పదైన తీర్పుచిక్కులో ఆమె చిక్కుకపోయింది. తరువాయి చరిత్రలోని ఏ సంఘటనయు దీనికి సమము కాదు. న్యాయస్థానములకు సంబంధించిన చర్య నిమిత్తము న్యాయము, ప్రభావము, అపఖ్యాతి, లేదా నిశ్చయత్వము లేకుండా అట్టి తీర్పుకు యింత దగ్గరగా వచ్చుటకు ఏ కూటమియు ఎప్పుడైనాగాని కూడుకొనదు. ప్రతి ఒక్కరు దాని కొనసాగింపుకే హాజరౌతూ ఉంటారు.

మనము ఒక ప్రక్క, “వానిని సిలువవేయుము?” అని కేకలు వేసిన వారిలోను, మరొక ప్రక్క, “ఎందుకు? ఇతడు ఏ దుష్కార్యము చేసెను?” అని ప్రశ్నించిన, పిలాతు ప్రక్కను నిలువబడవలెను (మత్తయి 27:23ఎ).

*మూడవదిగా, మనము యేసు విషయంలో ఏదో ఒక చర్య తీసికొనవలెనని ఈ కల మనకు గుర్తుచేయుచున్నది.* పిలాతు భార్య యేసును గూర్చి ఏదో ఒకటి చేయవలసివచ్చింది, గనుక మనము కూడా ఏదో ఒకటి చేయాల్సిందే. దేవుని కుమారుని ఎవరునూ ఉపేక్షించజాలరు. వారు ఉదాసీనంగా ఉండవచ్చునని ప్రజలు ఊహించుకొనవచ్చును, కానీ వారుండలేదు. ఆయనను గూర్చి ఏదో ఒక నిర్ణయము ఖచ్చితంగా తీసికొనబడవలెను. “నేను నా కలలో చూచిన ఇతని గూర్చి ఏమి చేయవలెను?” అని ఈ స్త్రీ తనను తాను ప్రశ్నించుకొనవలసి వచ్చినది. మనము కూడా, “క్రీస్తును గూర్చి నేనెరిగిన విషయములతో నేనేమి చేయవలెను?” అని ప్రశ్నించుకొనవలెను. కొందరికి ఈ ఎరుక ఇతరుల కంటె ఎక్కువగా ఉండవచ్చును, కానీ ఒక్కరు వారికివ్వబడిన నిదర్శనమును గూర్చి ప్రయోజనకరమైన ప్రక్రియను కొనసాగించుచు దానితో ఏమి చేయవలెనో తీర్మానించుకొనవలెను.

యేసు – ఆయన సన్నిధిలో – మనకు తీర్పు తీర్చును. “నా పక్షమున నుండనివాడు నాకు విరోధి” అని ఆయన చెప్పియున్నాడు (మత్తయి 12:30ఎ). మన యొద్ద గల నిదర్శనము చాలా ఉన్నదా లేక కొంచెమేనా అను దానితో నిమిత్తము లేకుండా, మనము కలిగియున్న దానితో ఏదో ఒకటి చేయవలెను. యేసును కలుసుకొన్న ఎవరైనను ఆయనను గూర్చి తటస్థంగా ఉండజాలరు.

ప్రోక్ల ఆమె కనిన కల చేత నివ్వెరపోయింది; అది ఆమెకు తన ఆత్మను కలవరపెట్టిన పీడకల అయ్యింది. యేసు తీర్పు విషయములో పిలాతు వ్యవహరించిన తీరు గూర్చి చేయుచుండిన తన చిత్రీకరణలో ఈ విషయము చేర్చబడవలెనని దానిని మత్తయి ఎన్నుకొన్నాడు. “ఆయన తన అద్భుత కార్యములు చేయుటకు, దేవుడు మానవ హేతు శక్తికి అంతుపట్టని విధానములలో కదలివెళ్లుచుండును” అనునది నిజమే.[2] ఆయన తన కృపాసహిత సందేశమును మన హృదయముల లోనికి చొప్పించుటకు దేవుడు కొన్ని పర్యాయములు అసాధారణమైన విధానములను వాడుకొంటాడనునది కూడా నిజమే. ప్రోక్ల కనిన కల కథలోని ఒక చిన్న భాగము మాత్రమే అయియున్నది. గనుక కథ అంతటినీ ఒక్క చోటచేర్చి అధ్యయనము చేసినప్పుడు, ఒక వివేచనాత్మక మనస్సుకు సరిపడునంతగా కూడబెట్టబడిన నిదర్శనమును మనము చూడగలము.

❖•❖•❖

*“ప్రోక్ల యిచ్చిన సలహా మొత్తంమీద సరైనదేనని చెప్పలేము. తన భర్త యేసు జోలికి వెళ్లవద్దని ఆమె ఆయనను బ్రతిమలాడుచుండింది. ఇది పిలాతు తానే స్వయంగా చేయుచుండిన ప్రయత్నమై యుండింది, అనగా నిందితుని జోలికి వెళ్లకుండా ఉండుటయే; అనగా, ఒక న్యాయాధిపతిగా తన బాధ్యతను ఏమార్చుటకే ప్రయత్నించుచుండెను. కానీ అది తప్పు. యేసు 'నిర్దోషి' అని ప్రకటించుట మాత్రమే గాక, వాస్తవమునకు ఆయన ఈ ప్రయత్నము పదే పదే చేశాడు, యేసు కేసును కొట్టివేయుటకు కూడా ఆయన చాలినంత ధైర్యముగలవాడును న్యాయవంతుడునై యుండవలసి యుండెను! ఆయన భార్య యిచ్చిన సలహా, కొంత మేరకు మంచిదే అయినా, అది యింకా ఎంతో ఉత్తమమైనదై యుండవలసి యుండెను.”*[3]

---

సూచనలు

[1]Tecitus Annals 3.33. [2]William Cowper, “God Moves in a Mysterious Way,” *Songs of Faith and Praise,* comp. and ed. Alton H. Howard (West Monroe, La.: Howard Publishing Co., 1944). [3]William Hendriksen, *Exposition of the Gospel According to Matthew,* New Testament Commentary (Grand Rapids, Mich.: Baker Book House, 1973), 954.